06ATP27_06ATP27.qxd 13-06-2025 PM 11:00 Page 1



## బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

బత్తలపల్లి, జూన్ 13 ప్రభాతవార్త



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న బిజెపి మాజీ మండల కన్వీనర్

బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలల్లో చేర్పించి విద్యాబుద్ధులు నేర్పించాలని ఎంఈఓ సుధాకర్ నాయక్, బిజెపి మాజీ మండల కన్వీనర్ ఆకులేటి వీరనారప్పలు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అప్పరాచెరువు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి సెలవులు అనంతరం జూన్ 12న 202526 విద్యా సంవత్సరం ప్రారంభమైందని ప్రతి విద్యార్థి పాఠశాలలకు క్రమం తప్పకుండా వెళ్లి విద్యలో రాణించాలని సూచించారు. ప్రభుత్వం కూడా పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించిందని పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో కూడా నాణ్యమైన విద్య బోధించడానికి విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించారన్నారు. పాఠశాలలోని మొత్తం 67 మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ భర్త సత్యనారాయణరెడ్డి, స్కూల్ కమిటీ చైర్మన్ గోపాల్, ఎకిల గురుప్రసాద్, ముసుగు రామచంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు కిట్లను పంపిణీ చేసిన జడ్పిటిసి



కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

అగళి, జూన్ 13 ప్రభాతవార్త

అగళి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. అందులో పుస్తకాలతోపాటు యూనిఫారం, షూలు, తదితర వస్తువులు ఉంటాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠశాల ప్రారంభమైన వెంటనే విద్యార్థులకు అందజేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులతోపాటు, మార్కెట్‌యార్డు డైరెక్టర్ శివరాములు, నాగోజప్ప, షౌకతలి, జయరామ్, మల్లిక, కరియన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ఇరిగేపల్లి ఉన్నత పాఠశాలలో పుస్తకాలను, కిట్లను సర్పంచు లింగరాజు, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు శ్రీనివాస్ పంపిణీ చేశారు. తెలుగుదేశం నాయకులురెడ్డి, షౌకతలి, ప్రధానోపాధ్యాయులు నాయకులు పాల్గొన్నారు.

## ఆంజినేయ స్వామి గుడిలో చోరీ

అగళి, జూన్ 13 ప్రభాతవార్త

మండల కేంద్రమైన అగళి చెరువు కట్టకింద ఉన్న ఆంజినేయస్వామి గుడి హుండీని పగలగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. హుండీ పగలగొట్టి హుండీలో ఉన్న సొమ్మును దొంగలు దోచుకెల్లారు. గతంలో రెండు మూడుసార్లు ఈ దేవాలయంలో హుండీ పగలగొట్టి సొమ్మును ఎత్తుకెల్లారు. కావున సంబంధిత పోలీసు శాఖవారు చొరవ తీసుకుని హుండీ దొంగలను పట్టుకుని న్యాయం చేయాలని భక్తులు కోరుతున్నారు.

## ఎస్ఎస్‌డ్యాన్స్ స్టూడియో అధ్వర్యంలో సమ్మర్ క్యాంప్

అమరాపురం జూన్ 13ప్రభాతవార్త



నిర్వాహకుడు దృశ్యం

మండల కేంద్రంలోని ఎస్ ఎస్ డ్యాన్స్ స్టూడియో నిర్వాహకుడు సునామిశివ అధ్వర్యంలో 14న శనివారం సమ్మర్ క్యాంప్ మెగా డ్యాన్స్ శిభిరంను అమరాపురం పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు శివ తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మడకశిరా ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి హాజరవుతారని తెలిపారు. అదేవిధంగా మాజీ జడ్పీటీసీ నరసింహమూర్తి, టిడిపి మండల కన్వీనర్ గణేష్ ,సీనియర్ నాయకులు మారుతి ప్రసాద్, కె ఎన్ ఎమ్ శివకుమార్ యాదవ్, కె ఎన్ ఎమ్ సురేష్ యాదవ్, క్రిష్ణ హార్డ్‌వేర్ యజమాని శర్వాన్ పాటిల్ హాజరవుతారని ప్రజలు అత్యధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## హేమావతి పాత ఎస్సీ కాలనీలో సమృద్ధిగా తాగునీరు

అమరాపురం జూన్ 13 ప్రభాతవార్త



బోర్ వేస్తున్న దృశ్యం

మండల పరిధిలోని హేమావతి పాత ఎస్సీ కాలనీలో త్రాగునీటి ఎద్దడి కారణంగా గత 15 రోజుల నుంచి వాటర్ ట్యాంక్ ద్వారా ప్రజలకు గ్రామపంచాయతీ వారు త్రాగునీరు అందించడం విధితమే. పాత ఎస్సీ కాలనీలోని త్రాగునీటి ఎద్దడి సమస్యను స్థానిక టిడిపి నాయకులు ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజుకు ,తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి దృష్టికి తీసుకెళ్లడంతో తక్షణమే బోర్వెల్ ను తవ్వించడం జరిగింది. సమృద్ధిగా నీళ్లు పడడం ద్వారా ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు మరియు మాజీ ఎమ్మెల్సీకి ప్రత్యేకధన్యవాదాలుతెలిపారు. తాలుక్ ఎస్సీ సెల్ అధ్యక్షులు జయకుమార్, టిఎన్టియుసి నియోజకవర్గ ఉపాధ్యక్షుడు రామచంద్ర యాదవ్, పంచాయతీ కన్వీనర్ తిప్పేస్వామి ,క్లస్టర్ ఇంచార్జ్ కృష్ణమూర్తి, ఎంపీటీసీ ఓంకార్ స్వామి, ఎక్స్ ఎంపీటీసీ శివకుమార్ ,మాజీ సర్పంచ్ కుమారస్వామి, మాలింగప్ప,ప్రభాకర్ ,తిమ్మన్న, మాజీవార్డ్‌మెంబర్ లింగరాజు, సీనియర్ నాయకులు గోంచికార్ తిమ్మన్న ఆలయకమిటీ చైర్మన్ కరేగౌడ్, రవికుమార్ తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## తల్లికి వందనం పథకం -ఆధార్‌బ్యాంక్ ఖాతా లింకింగ్ చేసుకోండి.

### జూన్ 15 చివరి తేదీ

**కొత్తచెరువు జూన్ 13 ప్రభాత వార్త** : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా అమలు చేయబోతున్న తల్లికి వందనం పథకం కింద ఎస్సీ మరియు ఎస్టీ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడానికి, వారి ఆధార్ నంబర్లు వారి బ్యాంక్ ఖాతాలతో జూన్ 15 లోపు అనుసంధానం చేసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఐ శివ రంగ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికీ ఇంకా సుమారు 1027 మంది ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థుల ఆధార్‌బ్యాంక్ ఖాతా లింకింగ్ పూర్తికాలేదు. ఇంకా మిగిలి ఉన్న విద్యార్థుల కోసం సచివాలయ ఉద్యోగులు డబ్ల్యూ ఈఏలు మరియు డబ్ల్యూ ఈ డి పి ఎస్ విద్యార్థులను లేదా వారి కుటుంబాలను వ్యక్తిగతంగా సంప్రదించాలి. విద్యార్థి ఆధార్ నంబర్‌ను బ్యాంక్ ఖాతాతో యన్ పీసీఐ మ్యాపింగ్ చేయించాలి. ప్రతి రోజు పురోగతిని సమీక్షిస్తూ, డబ్ల్యూ ఈ ఏ/ డబ్ల్యూ ఈడిపిఎస్ లతో సమన్వయం చేయాలి. ఈ ప్రక్రియను జూన్ 15, 2025 నాటికి పూర్తిచేసి తగు నివేదికలను సమర్పించాలనీ ఆయన కోరారు.

## సికిల్ సెల్ వ్యాధి రహిత సమాజాన్ని నిర్మిద్దాం

వజ్రకరూర్ జూన్ 13 ప్రభాతవార్త



రక్త పరీక్షలు నిర్వ హిస్తున్న వైద్యులు సర్దార్ వలి

వజ్రకరూరు మండల కేంద్రం లోని స్థానిక వెంకట్నా పల్లి పెద్ద తండా గ్రామంలో శుక్రవారం వైద్య అధికారి డాక్టర్ తేజస్వి, డాక్టర్ సర్దార్ వలి ఆధ్వర్యంలో సికిల్ సెల్ వ్యాధి రక్త పరీక్షలు, మలేరియా మాసోత్సావాల ర్యాలీ నిర్వహించారు. సికిల్ సెల్ వ్యాధి రహిత సమాజాన్ని నిర్మిద్దామని గ్రామస్తులకు వైద్యులు పిలుపునిచ్చారు. సాధారణంగా మనిషి రక్తం లోని ఎర్ర రక్త కణాలు గుండ్రంగా పెప్పర్మెంట్ల ఆకారంలో ఉంటు కణాలు రక్తనాళాల ద్వారా శరీరమంతా ప్రయాణిస్తూ వివిధ అవయవాలకు ప్రాణవాయువును ఆక్సిజన్ ను సరఫరా చేస్తుంటాయన్నారు. కొంతమందిలో జన్యు సంబంధ మార్పుల వల్ల ఎర్ర రక్త కణాలు సికిల్ ఆకారంలోకి మార్పు చెందుతాయన్నారు. 0 నుండి 40 సంవత్సరాల లోపు వారందరికీ సికిల్ సెల్ వ్యాధి పై అవగాహన కల్పించి రక్త పరీక్షలు చేశారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మలేరియా నివారణ మాసోత్సవాల ర్యాలీ నిర్వహించారు. మలేరియా వ్యాధి అంతం మనతోనే అంటూ నినాదాలతో ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ హెచ్ ఈ ఓ గురు ప్రసాద్. హెల్త్ సూపర్వైజర్ సుశీలమ్మ, నాగ శంకర్, ఎం.ఎల్.హెచ్.పీలు, అమృత, బాల చౌడేశ్వరి అనురాధ శ్రావణి, ఏఎన్ఎం లు వనజ్యోతి లక్ష్మి, జ్యోతి ఉషా మోనిక, హెల్త్ అసిస్టెంట్ లు సంపత్, నాగరాజు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

వజ్రకరూర్ జూన్ 13 ప్రభాతవార్త



విద్యార్థులకు పుస్తకాలుపంపిణీ చేస్తున్న దృశ్యం

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను నిర్వహిస్తున్నారని తెలుగుదేశం పార్టీ నాయకులు తిమ్మప్ప, ఈశ్వరయ్య, రవి, సదానంద లు అన్నారు. మండలం లోని గడి హోతూరు గ్రామంలో శుక్రవారం పాఠశాలవిద్యార్థులకు ఉపాధ్యాయులతో కలిసి పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాలలు మాదిరిగా వసతులను కల్పించి నాణ్యమైన విద్యను బోధించడం జరుగుతుందన్నారు. 2,200విలువచేసేపుస్తకాలు, నోటుబుక్కులు, సంచి, యూనిఫామ్, బూట్లను విద్యార్థులకు ఉచితంగా ప్రభుత్వం అందిస్తుందన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం కింద సన్న బియ్యంతో పోషకాలతోకూడిన భోజనాన్ని అందించడం జరుగుతుందన్నారు. చక్కగా చదువుకొని భవిష్యత్తులో గ్రామాభివృద్ధికి పాటుపడాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పులికొండ ఉపాధ్యాయుడు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

పెనుకొండ జూన్ 13 ప్రభాతవార్త



ఎమ్మార్పీఎస్ నాయకులతో ఎమ్మార్పీఎస్ రాష్ట్రఅధ్యక్షులు రుద్రపోగు సురేష్

ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు రుద్రపోగు సురేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో జరిగిన ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జులై 7వ తేదీన వేడుకలను గ్రామ గ్రామాన పెద్ద ఎత్తున నిర్వహించాలన్నారు ప్రతి గ్రామంలోనూ ఎమ్మార్పీఎస్ జెండా ఎగురవేయాలన్నారు అదేవిధంగా గ్రామాలలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంస్థల కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ సహకారంతో ఎస్సీ వర్గీకరణ సాధించుకోవడం గర్వకారణం అన్నారు. ఆయన ఆదేశాల మేరకు మాదిగల అభ్యున్నతకై ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. తదనంతరం ఇటీవల విమాన ప్రమాదంలో మరణించిన మృతులకు నివాళులర్పించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రామాంజనేయులు పెద్దన్న బైలంజి ప్రసాద్ సూర్యనారాయణ రాజు పోతులయ్య పాల్గొన్నారు.

## నేడే అంజనాదేవి 48వ, ఆరాధన మహోత్సవం..

చెన్నేకొత్తపల్లి, మే 13(ప్రభాతవార్త



అంజనాదేవి ఫోటో

మండల కేంద్ర మైన చెన్నె కొత్తపల్లి సమీపాన గల కన్వాశ్రమం, కొండల్లో వెలిసిన మాతశ్రీ అంజనాదేవి 48వ ఆరాధనమహోత్సవం శనివారం నిర్వహించనున్నట్లు ఆశ్రమ, అధ్యక్షులు, దత్త నందగిరి స్వామి తెలిపారు, ఈ సందర్భంగా శనివారం ఉదయం 6 గంటలకు గోపూజ బజార్చణం 7 గంటల నుండి భగవద్గీత పారాయణం సాయంత్రం ఆరు గంటల నుండి లలిత సహస్రనామ పారాయణం ఏడు గంటల నుండిఅంజనాదేవి మందిరంలో ప్రత్యేక పూజలు ఎనిమిది గంటలకు దీపారాధన, మహా మంగళ హారతి తదుపరి తీర్థప్రసాదం వినియోగం భోజనం 9 గంటలకు సాదు సత్పురుషులు చే ప్రవచనాలు ఆధ్యాత్మిక ఉపన్యాసాలు ఒంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు రాత్రి 10:30 గంటలకు కదిరి సూర్యనారాయణ భాగవతార్ గారిచే హరికథ కాలక్షేపం భోజనం తానుచే భజన కార్యక్రమంలో ఉంటాయని తెలిపారు కావున భక్తులు ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## కనగానపల్లి హెచ్ఎంగా ప్రసన్న లక్ష్మి పదవీ బాధ్యతలు



బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రసన్న లక్ష్మి

కనగానపల్లి జూన్ 13 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ నందు శుక్రవారం నూతన ఉపాధ్యాయురాలిగా ప్రసన్న లక్ష్మి పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈమె ఉరవకొండ మండలం పెద్ద కౌకుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి రావడం జరిగింది. ఇక్కడ ప్రధానోపాధ్యాయురాలుగా పనిచేస్తున్న లక్ష్మీదేవి ఆత్మకూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీఅయ్యారు. నూతన ప్రధానోపాధ్యాయురాలు ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతోపాటు విద్యాబోధన మెరుగుపడేందుకు తమ వంతు కృషి చేస్తానని ఆమె తెలిపారు.

## రాకెట్ల గ్రామంలో విరబూసిన బ్రహ్మకమలం

### -పూజలు నిర్వహించిన ఇంటి యజమానులు

ఉరవకొండ, జూన్ 13 ప్రభాతవార్త



రాకెట్లలో విరబూసిన బ్రహ్మకమలం

మండల పరిధిలోని రాకెట్ల గ్రామంలోని ముత్తలూరు అనిత ఇంట్లో శుక్రవారం బ్రహ్మకమలం విరబూసింది. బ్రహ్మకమలం విరమూసిన వెంటనే ఇంటి యజమానులు అనీత, అశోక్‌కుమార్ దంపతులు పూజలు నిర్వహించారు. హిందూ పురాణాల ప్రకారం బ్రహ్మకమలాలపై బ్రహ్మదేవుడు కూర్చుని ఉంటాడని చెబుతారు. అరుదుగా ఏడాదికొకసారి విరబూసే బ్రహ్మకమాలాలు ఇదివరకు హిమాలయా పర్వతాల్లో అరుదుగా లభించిన మొక్క కాగా అది కాలక్రమేనా ప్రతి ఇంటి ఆవరణంలోనూ పెంచడం జరుగుతూ వస్తోంది. ఈ మొక్కపై ఆకులే పువ్వుగా రూపాంతరం చెందుతాయని చెబుతారు.


## మండల వ్యవసాయాధికారిగా బి.రామకృష్ణుడు బాధ్యతలు స్వీకరణ

### -ఏవోను కలిసి సన్మానించిన జైకిసాన్ ఫౌండేషన్ ఛైర్మెన్

ఉరవకొండ, జూన్ 13 ప్రభాతవార్త



మండల వ్యవసాయాధికారిగా బాధ్యతలు చేపట్టిన బి.రామకృష్ణుడు



ఏవో బి.రామకృష్ణుడును సన్మానిస్తున్న జై కిసాన్ ఫౌండేషన్ ఛైర్మెన్ నాగమల్లి ఓబులేష్

ఉరవకొండ మండల వ్యవసాయాధికారిగా బి.రామకృష్ణుడు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ వ్యవసాయాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న జి.శుభకర్ కూడేరుకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో యల్లనూరు మండల వ్యవసాయాధికారిగా ఉన్న బి.రామకృష్ణుడును నియమించారు. ఉదయం ఆయన ఏడీఏ కార్యాలయం చేరుకొని విధుల్లో చేరగా బదిలీ అయిన ఏవో జి.శుభకర్ ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా నూతన ఏవో బి.రామకృష్ణుడు మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా వారికి లబ్ది చేకూర్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. కాగా జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేష్ నూతన ఏవో బి.రామకృష్ణుడును మర్యాదపూర్వకంగా కలిసి షాలువాకప్పి పూలమాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతపురం జైకిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో మొక్కను నాటారు.

## విద్యకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది

ధర్మవరం, జూన్ 13(ప్రభాతవార్త)



విద్యామిత్రకిట్లను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోందని, అందుకు ప్రభుత్వ పాఠశాలలో అన్ని మౌళిక వసతులు కల్పిస్తోందని 25వ వార్డుటీడీపీ ఇన్చార్జ్ భీమనేని ప్రసాదానాయుడు పేర్కొన్నారు. శుక్రవారం విద్యార్థులకు లక్ష్మీచెన్నకేశవపురంలో ప్రభుత్వ ప్రాథమికోన్నతపాఠశాలలో ప్రభుత్వం అందించిన పాఠ్యపుస్తకాలు, నోట్పుస్తకాలు, యూనిఫాంలను ఆయనతో పాటు టీడీపీ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా వార్డు ఇన్చార్జ్ మాట్లాడుతూ..గతంలో పాఠ్యపుస్తకాలు పూర్తిస్థాయిలో వచ్చేవి కావని, విడతలవారిగా వచ్చేవని దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. బ్యాగులు కూడా నాణ్యతలేనివి ఇచ్చేవారన్నారు.. ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థి విద్యలో రాణించాలని సమూల మార్పులు తీసుకువచ్చిందన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు అన్ని వసతులతోపాటు మద్యాహ్న భోజనం సన్నబియ్యంతో నాణ్యమైన భోజనం కూడా అందిస్తోందన్నారు. విద్యార్థులు కూడా బాగా చదువుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. నియోజకర్గ టీడీపీ ఇన్చార్జ్ పరిటాలశ్రీరామ్ ఆదేశాల మేరకు పాఠశాలలో విద్యార్థులకు విద్యాకిట్లను అందజేశామని ఆయన తెలిపారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అవలంబించినప్పుడే సమాజంలో మంచిగుర్తింపు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నాగప్ప, టీడీపీ నాయకులు మాధవరెడ్డి, చీమలరామాంజి, క్లస్టర్‌రామాంజి, గడ్డంసూరి, పంది పోటురవి, పెద్దనరసింహులు, బొమ్మలాట శీన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చేనేతకార్మికుడి కుటుంబానికి అండగా చేనేత ప్రముఖులు...!

ధర్మవరం,జూన్13(ప్రభాతవార్త)



మృతుని తల్లికి ఆర్థిక సాయం అందజేస్తున్న టీడీపీ నాయకులు

పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన దేవాంగం చంద్రశేఖర్ (44) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న చేనేత ప్రముఖులు, టీడీపీ నాయకుడు నంధారఘువ, 29,30వవార్డుల కోఆర్డినేటర్ కేశగాళ్ల శ్రీనివాసులు నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు చంద్రశేఖర్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి అనంతరం తల్లిని పరామర్శించి అంత్యక్రియల కోసం రూ.15వేలు నగదును అందజేశారు. ఆర్థికాసాయం అందించినవారిలో టీడీపీ నాయకులు సదాశివ, బెల్లం తిరుపాల్, చెన్నప్ప, నారాయణస్వామి, అశ్వర్థ, ఆది పాల్గొన్నారు.

## అహ్మదాబాద్ విమాన ప్రమాదం బాధాకరం

ధర్మవరం,జూన్13 (ప్రభాతవార్త)

అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘన తనను తీవ్రంగా కలచివేసిందని, ఈ ఘటనలో చాలా మంది మృతిచెందడం బాధాకరమని కాంగ్రెస్ పార్టీ నాయకులు తుంపర్తిపరమేష్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు.. అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటనలో చాలా మృతిచెందారన్నారు. అదేవిదంగా ఈ ఘటనలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. 1950లో రైలుపట్టాలు తప్పినప్పుడు నైతిక బాధ్యత వహించి లాల్బహుదూర్ శాస్త్రీ తన పదవికి రాజీనామా చేశారన్నారు. ప్రస్తుత అహ్మదాబాద్ విమాన ఘటనకు నైతిక బాధ్యత హోంమంత్రి అమిత్, వహిస్తూ ప్రదానమంత్రి నరేంద్రమోది, పౌరవిమానయానశాఖ మంత్రి రామ్మోహన్నాయుడు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

## కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

గుంతకల్లు, జూన్ 13 ప్రభాతవార్త



పొట్టి శ్రీరాములు సర్కిల్ వద్ద నిరసన చేస్తున్న దృశ్యం

కూటమి ప్రభుత్వం ఆటో మోటార్ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టియు) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సురేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ సంఘం ఆధ్వర్యంలో స్థానిక పొట్టి శ్రీరాములు సర్కిల్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా కార్మికులకు అనేక వాగ్దానాలు ఇచ్చి మాట తప్పిందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గిస్తామని, వాహన మిత్ర పథకం కింద ప్రతి కార్మికుడికి 15 వేలు అందచేస్తామని వాగ్దానం చేశారని గుర్తు చేశారు. అయితే ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఒక్క హామీని కూడా అమలు చేయలేదన్నారు. కేవలం అమరావతి రాజధాని, పోలవరం కాంట్రాక్టు బిల్లులు చెల్లించడానికి వేల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. ప్రధానంగా కార్మిక రంగానికి వ్యతిరేకంగా వున్న జిఒ నెంబర్ 21ని వెంటనే రద్దు చేయాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయనకోరారు. ఈకార్యక్రమంలో జిల్లాకమిటీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, నాయకులు జిలాన్, రామదాస్, ఆటోయూనియన్ నాయకులు గోపి, రామంజి, కమిటీ సభ్యులు షెక్షావలి, బాషా, తదితరులు పాల్గొన్నారు.

## ఆ నలుగురు సేవా సమితికి రూ.5 వేలు విరాళం

గుంతకల్లు, జూన్ 13 ప్రభాతవార్త



మంజుల వెంకటేష్‌కు చెక్కును అందచేస్తున్న ఆనంద్

పట్టణానికి చెందిన ఆనంద్ తన కుమారుడు ప్రజ్వల్‌సాయి జన్మదినం సందర్భంగా ఆ నలుగురు సేవా సమితికి 5వేల రూపాయల విరాళం అందించి దాతృత్వం చాటుకున్నారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మంజుల వెంకటేష్‌కు శుక్రవారం చెక్కును అందచేశారు. సేవా సమితి వారు చేస్తున్న కార్యక్రమాలకు తన వంతు సాయంగా ఆర్థిక సాయం అందించినట్లు ఆనంద్ తెలిపారు. ఈసందర్భంగా సమితిసభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

## వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

గుత్తి, జూన్ 13 ప్రభాతవార్త



కమీషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

గుత్తి మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు వ్యాధులు ప్రబలకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సిపిఐ కార్యదర్శి రామదాసు డిమాండ్ చేశారు. వర్షాకాలం ప్రారంభమైనందు వల్ల డ్రైనేజీలు, మురుగు కాలువల నీరు రోడ్లపై నిల్వ వుండి ప్రజలకు సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం వుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్ సిబ్బంది స్పందించి పరిసరాలను పరిశుభ్రంగా వుంచాలని, ప్రతి కాలనీలో బ్లీచింగ్ పౌడర్ పిచికారి చేయాలని డిమాండ్ చేశారు. కావునా అధికారులు ముందస్తుగా తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ కమీషనర్ జబ్బార్‌మియాకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు, రమేష్, వెంకటరాముడు, నరసింహయ్య, నజీర్, రసూల్‌బీ, మహమ్మదాబీ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతి అనుసరిస్తే రైతు చేతిలో నిత్యం డబ్బులే

### - బూదిలివాండ్లపల్లి రైతు భాస్కర్‌రెడ్డి పొలంలో సాగుకు నాంది

గోరంట్ల, జూన్ 13 ప్రభాతవార్త



పొలంలో పంట సాగు పద్ధతులు అనుసరిస్తున్న దృశ్యం

గోరంట్ల మండలంలోని వానవోలు యూనిట్ పరిధిలో గల బూదిలివాండ్లపల్లి గ్రామానికి చెందిన రైతు భాస్కర్‌రెడ్డి పొలంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో పంట సాగుకు నాంది పలికారు. ఈ సందర్భంగా రైతులు పంటలను ఈ పద్ధతిలో సాగు చేస్తే రైతుల చేతుల్లో నిత్యం డబ్బులు వుంటాయనే విధంగా దిగుబడి సాధించవచ్చని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులు మరియు మోడల్స్ గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల ఎఫ్‌పిఓసిసి శ్రీరాములనాయక్, వానవోలు యూనిట్ ఇన్‌చార్జ్ నరసింహమూర్తి, సైదావలి, అనసూయ, తదితరులు పాల్గొన్నారు.

## అక్కమ్మ ఆలయంలో వడ్డిపల్లి గ్రామస్తులు పూజలు

గోరంట్ల, జూన్ 13 ప్రభాతవార్త



ప్రత్యేక పూజల్లో అక్కమ్మ విగ్రహాలు

మండలంలోని రెడ్డిచెరువు పల్లి పంచాయతీ పరిధిలోని వడ్డిపల్లి గ్రామంలో వెలసిన అక్కమ్మ ఆలయంలో శుక్రవారం గ్రామస్తులు పెద్దఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ఆనవాయితీలో భాగంగా ప్రతి ఏటా నిర్వహించే పూజా కార్యక్రమాలను పురస్కరించుకొని అక్కమ్మ విగ్రహాలకు ప్రత్యేక పూలతో అలంకరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్టోర్ డీలర్ రమణ, గగన్‌కుమార్, వెంకటేష్, శ్రీనివాసులు, నారాయణస్వామి, గోవర్ధన్, వినోద్, శేషాద్రి, మహేంద్ర, హరీష్, శంకరప్ప, పాల్గొన్నారు.



ఆలయం వద్ద అన్నదానం నిర్వహిస్తున్న నిర్వాహకులు

09ATP27_09ATP27.qxd 13-06-2025 PM 11:01 Page 1



# ఉరవకొండ ఆర్టీసీ డిపోలో యోగా శిక్షణా తరగతులు

**-యోగ సాధన చేయించిన యోగ గురువు నాగమల్లి ఓబులేష్**

ఉరవకొండ, జూన్ 13 ప్రభాతవార్త



యోగ శిక్షణ పొందుతున్న కార్మికులు, సిబ్బంది

ఈనెల 21వ తేదీన జరిగే అంతర్జాతీయ యోగా దినోత్స వాన్ని పురస్కరిం చుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణం లోని ఆర్టీసీ డిపో లో శు క్రవారం యోగా



శిక్షణా కార్యక్రమం జరిగింది. డిపో మేనేజర్ ఎస్. హంపన్న ఆధ్వ ర్యంలో యోగా గురువు నాగమల్లి ఓబులేష్ కార్మికులు, డ్రైవర్లు, కండక్టర్లు,



శిక్షణ పొందిన కార్మికులతో డీఎం హనుమప్ప, యోగా గురువు నాగమల్లి ఓబులేష్

సిబ్బందికి యోగాసాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా యోగా గురువు నాగమల్లి ఓబులేష్ మాట్లాడుతూ యోగాను ప్రతి ఒక్కరూ రోజువారి కార్యక్రమాల్లో భాగం చేసుకుంటే జీవితాంతం ఆరోగ్యంగా ఉంటారన్నారు. యోగావల్ల ఒత్తిడి దూరమై మానసిక, శారీరక ప్రశాంతత లభిస్తుందన్నారు. యోగాలోని ముఖ్య ఆసనాలతోపాటు ప్రాణాయామం చేయడంవల్ల దీర్ఘకాలిక రోగాల నుండి సైతం ఉపశమనం లభిస్తుందన్నారు. యోగాసనాలవల్ల శరీరక బలం చేకూరి, ఆక్సి జన్‌స్థాయిని మెరుగుపడుతుందని, రోగనిరోధక శక్తి పెరుగు తుందని వివరించారు. డిపో మేజర్ ఎస్.హంపన్న మాట్లాడుతూ కార్మికులు, సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లు యోగాను జీవితంలో భాగం చేసుకొని ఒత్తిడుల నుండి ఉపశమనం పొంది ఆరోగ్యవంతగా జీవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇంచార్జ్ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ స్థాయిలో యూనిఫామ్ మరియు పుస్తకాల పంపిణీ



విద్యామిత్రకిట్లను పంపిణీ చేస్తున్న కూటమినాయకులు

శెట్టూరు, జూన్ 13(ప్రభాతవార్త)

రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోం దని, అందుకు ప్రభుత్వ పాఠశాల లో అన్ని మౌళిక వసతులు కల్పి స్తోందని. కూటమి నాయకులు పేర్కొ న్నారు. శుక్రవా రం విద్యార్థులకు లక్ష్మంపల్లి గ్రామంలో ప్రభుత్వ ప్రాథమికోన్నతపాఠశాలలో ప్రభుత్వం అందించిన పాఠ్యపుస్తకాలు, నోట్పుస్తకాలు, యూనిఫాంలను కూటమి నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గతంలో పాఠ్యపుస్తకాలు పూర్తి స్థాయిలో వచ్చేవి కావని, విడతలవారిగా వచ్చేవని దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. బ్యాగులు కూడా నాణ్యతలేనివి ఇచ్చేవారన్నారు.. ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థి విద్యలో రాణించాలని సమూల మార్పులు తీసుకువచ్చిందన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు అన్ని వసతులతోపాటు మద్యాహ్న భోజనం సన్నబియ్యంతో నాణ్యమైన భోజనం కూడా అందిస్తోందన్నారు. నియోజకర్గ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అనిలినేని సురేంద్రబాబు ఆదేశాల మేరకు పాఠశాలలో విద్యార్థులకు విద్యాకిట్లను అందజేశామన్నారు. ఈ కార్యక్రమం లో పాఠశాల సిబ్బంది. పాఠశాల కమిటీ చైర్మన్ తలారి బాబు.బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు బంగారు మల్లారెడ్డి. సెట్టూరు మండలం సింగల్ విండో డైరెక్టర్ ఎం ఖాదర్ వలీ. మాజీ సర్పంచ్ మరి స్వామి డీలర్లు. గౌని బజ్జప్ప. వీరభద్ర. టీడీపీ నాయకులు. తలారి సోమనాథ్. లక్ష్మణ్.. తదితరులు పాల్గొన్నారు.

# ఏబీవీపీ అనంతపురం జిల్లా కన్వీనర్ గా శివరాజ్

ఉరవకొండ, జూన్ 13 ప్రభాతవార్త



ఏబీవీపీ అనంతపురం జిల్లా కన్వీనర్ శివరాజ్

అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) అనంతపురం జిల్లా కన్వీనర్ గా శివరాజ్ ఎన్నికయ్యారు. ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకు అనంతపురంలో జరిగిన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ప్రాంత అభ్యాస వర్గ లో అనంతపురం జిల్లా కన్వీనర్ గా శివరాజ్ ఎంపిక చేశారు. ఈ సందర్భంగా శివరాజ్ మాట్లాడుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నిరంతరం విద్యార్థులు సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తూ విద్యార్థుల్లోను జాతీయ భావాన్ని పెంపొందిస్తూ దేశం కోసం, ధర్మం కోసం పని చేస్తోందన్నారు. సేవా కార్యక్రమాల్లో కూడా ముందుండి విద్యార్థి పరిషత్ కార్యకర్తలు పని చేస్తున్నారన్నారు. తనపై నమ్మకం ఉంచి అనంతపురం జిల్లా కన్వీనర్ గా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర శాఖకు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా ప్రపంచ రక్తదాతల దినోత్సవం

**- రక్తదానం చేసిన ఆర్డీఓ శ్రీనివాస్, తహశీల్దార్ రమాదేవి**



రక్తదానం చేస్తున్న ఆర్డీఓ శ్రీనివాస్, తహశీల్దార్ రమాదేవి

గుంతకల్లు, జూన్ 13 ప్రభాతవార్త

జన విజ్ఞాన వేదిక, ప్రగతి మైత్రి మహిళా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వాసు పత్రిలోని బ్లడ్ బ్యాంక్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్

కేంద్రంలో జరిగిన కార్యక్రమానికి జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ హరిప్రసాద్‌యాదవ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ శ్రీనివాస్, తహశీల్దార్ రమాదేవిలు రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ బ్లడ్ బ్యాంకుకు ప్రతి ఒక్కరు రక్త సహాయం అందించాలని పిలుపునిచ్చారు. ప్రసవ సమయంలో గర్భవతులకు, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు, పలు రకాల ఆపరేషన్ల సమయంలో, ప్రధానంగా తల సేమియా రోగులకు రక్తం అవసరమవుతుంద న్నారు. రక్తదానంపై అపోహలు మాని 18 ఏళ్ల పైబడిన, 60 ఏళ్ల లోపు వున్న ప్రతి ఒక్కరు రక్తదానం చేయవచ్చన్నారు. రక్తదానం చేయడం సామాజిక బాధ్యతగా భావించాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అజేంద్రరావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జయవర్ధన్‌రెడ్డి, మహిళా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ప్రభాకర్, టిడిపి నాయకులు ఆమ్లెట్ మస్తాన్‌యాదవ్, సంఘ సేవకులు దొడ్డప్ప, వైసిపి యువజన విభాగం నాయకులు భాసిద్, మైత్రి మహిళా సంఘం ప్రోగ్రాం మేనేజర్ రమేష్, జన విజ్ఞాన వేదిక నాయకులు చిట్టిబాబు, నీలకంఠ, మిమిక్రీ కళాకారుడు లింగమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# బదిలీపై వెళ్తున్న ఉద్యోగికి ఘన సన్మానం



కానిస్టేబుల్‌ను సన్మానిస్తున్న ఎస్ఐ శివ

బెలుగుప్ప, జూన్ 13 ప్రభాతవార్త

ప్రభుత్వ బదిలీల్లో భాగంగా బెలుగుప్ప పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న రవిని సబ్ ఇన్స్‌పెక్టర్ శివ, సిబ్బంది ఘనంగా సన్మానించారు. శుక్రవారం రోజు మండల పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ శివ, ఏఎస్ఐ రామదాసు, ఆధ్వర్యంలో శాలువాలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. బెలుగుప్ప పోలీస్‌స్టేషన్‌లో 2009-2025 వరకు విధులు నిర్వహించి మండలంలో ఎలాంటి సంఘటనలు జరిగినా కూడా అందుబాటులో ఉండి వారికి రక్షణ కల్పించాలని ఎన్నో కేసులను ఎదుర్కొన్నానని ఆయన తెలిపారు. అందులోభాగంగా ఎస్ఐ శివ మాట్లాడుతూ.. అని విధులకు మరింత మెరుగైన ఉద్యోగం చేస్తూ బదిలీపై వెళ్తున్న కానిస్టేబుల్ రవికి కుందుర్పి స్టేషన్‌కు బదిలీ కావడం వల్ల ఇతని లోటును తీర్చలేమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విమాన ప్రమాదంలో మరణించిన ప్రయాణికులకు సంతాపం



పెన్షనర్ల భవన్లో సంతాప సమావేశంలో ప్రసంగిస్తున్న అధ్యక్షులు మల్లికార్జు

కళ్యాణదుర్గం, జూన్ 13 ప్రభాతవార్త :

గుజరాత్ సమీపంలోని అహ్మదాబాద్ విమాన ప్రయాణంలో 265 మంది విమానం ప్రమాదంలో మరణించడం చాలా బాధాకరమని మరణించిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. శుక్రవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి తిప్పేస్వామి అధ్యక్షతన జరిగిన సంతాప సభలో వక్తలు పెన్షనర్ల సంఘం అధ్యక్షులు మల్లికార్జున, జర్నలిస్టుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లింగప్రసాద్ మాట్లాడుతూ అత్యంత ప్రతిష్టాత్మకంగా సాంకేతిక సమస్యలను పరిశీలించిన తరువాతే టెకాఫ్ చేయాల్సి న పరిస్థితి ఉందని, అయితే ఎక్కడ లోపం జరిగిందో తెలియకపోయినా, టెకాఫ్ అయిన ఒక నిమిషంలోనే కూలిపోయి విమానంలోని 265 మంది విమాన విస్పోటంలో మరణించడం చాలా బాధాకరమని తెలిపారు. విమాన ప్రమాదంలో చోటు చేసుకున్న సాంకేతిక సమస్యలను దర్యాప్తులో స్పష్టమోతాయని అన్నారు. హనుమంతయ్య, భగవాన్ దాస్,విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

# స్థలవివాదంలో అన్నదమ్ముల మధ్య ఘర్షణ...?

**తహశీల్దార్ కార్యాలయ ఆవరణంలో**

**క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్యాయత్నం...!**

ధర్మవరం, జూన్ 13(ప్రభాతవార్త)

పట్టణంలోని స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణంలో పట్టణ వీఆర్ఏ రాము, తమ్ముడు శివ మధ్య స్థలవివాదంతో ఘర్షణ పడి శివ క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నంచేసుకున్నసంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. రెవిన్యూ అధికారులు, వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు....పట్టణ వీఆర్ఏగా పనిచేస్తున్న రాము అతని తమ్ముడు శివతో కొంతకాలంగా ఓ ఇంటిస్థలం వివాదం జరుగుతోంది. ఈ స్థలంలో గతంలో పెద్దమనుషులమధ్య పంచాయతీ చేసుకున్నారు. పంచాయతీలో పెద్దమనుషులు చెప్పిన విధంగా రాము డబ్బులు ఇవ్వలేదని తమ్ముడు శివ శుక్రవారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి గొడవ పడ్డాడు. దీంతో శివ తనవెంట తెచ్చుకున్న క్రిమిసంహారక మందును సేవించి ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డాడు. వెంటనే శివను అక్కడున్న వారు ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడనుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

# హత్యయత్నం కేసులో ముద్దాయిలు అరెస్ట్

పుట్టపర్తి క్రొత్తచెరువు, జూన్ 13, ప్రభాతవార్త

పుట్టపర్తి సబ్ డివిజన్ పరిధిలోని కొత్తచెరువు పోలీస్ స్టేషన్ పరిధిలో కొత్తచెరువు గ్రామం నందు ఈనెల ఏడవ తేదీన హత్యాయత్నానికి ప్రయత్నించిన ముద్దాయిలను అదుపులోకి తీసుకున్నట్లు కొత్తచెరువు సర్కిల్ ఇన్స్పెక్టర్ జి మారుతి శంకర్ తెలియజేశారు. శుక్రవారం పుట్టపర్తి అర్బన్ పోలీస్ స్టేషన్ నందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కొత్తచెరువుకు చెందిన దాల్ సూరి మరియు అతని భార్య మహాలక్ష్మి ఇరువురు కలిసి అనంతపురం నగరం లోని వేణుగోపాల్ నగర్ కు చెందిన తిరుమల శెట్టి గారి సుశీలమ్మకు సుమారు ఐదు సంవత్సరాల క్రితం ధర్మవరం రోడ్డులోని సర్వే నెంబర్ 446లో గల 7.65 సెంట్ల భూమిని అమ్మడం జరిగిందన్నారు. ఆ విషయంలో సదరు స్థలాన్ని ఖాళీ చేయించమని దాన్ని సూరి ని అడగగా అతను ఒప్పుకో లేదనీ, దీంతో సుశీలమ్మ సదర స్థలంలో సుమారు వారం క్రితం అనగా 07.06.2025 వ తేదీ కంచెను వేస్తున్న సమయంలో, వేసిన కంచెను పగలగొట్టి అడ్డం వచ్చిన సుశీలమ్మ కొడుకు సాగర్ రెడ్డి వారి కూలీల పై దాల్ మిల్ సూరి వారి భార్య మరియు అనుచరులు కలిసి మారునాయుధాలైన రాడ్లు కట్టెలు రాళ్లతో ముకుమ్మడిగా వారిపై దాడి చేసి హత్యాయత్నం చేసి స్థలమును స్వాధీనం లో చేసుకోవాలని దాడి చేయడం జరిగిందన్నారు. ఈ దాడిలో సుశీలమ్మ కొడుకు సాగర్ రెడ్డికి, అక్కడికి వచ్చిన ఇద్దరు డ్రైవరులు మరియు 5 మండి కూలీలు. 9 మందికి బలమైన రక్త ,మూగ గాయాలు అయ్యాయన్నారు. ఈ విషయంలో కొత్తచెరువు పోలీస్ స్టేషన్ నందు ద్పి.వ్పి.42/2025 అండర్ సెక్షన్ 191(2), 191(3), 117(1), 119(1),118(1),109(1), 74, 326(1),329(3) ఆర్/డబ్ల్యూ 190 బి ఎన్ ఎస్ కింద కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ముద్దాయిల ఆచూకీ నిమిత్తం గాలింపు చేపట్టగా శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో రాబడిన ఖచ్చితమైన సమాచారం మేరకు 5 మంది ముద్దాయిలను కొత్తచెరువు ధర్మవరం రోడ్డు, మార్కెట్ యార్డ్ సమీపంలో అదుపులోకి తీసుకొని రిమాండ్ తరలించడం జరిగిందన్నారు. అరెస్ట్ చేసిన వారిలో కొత్తచెరువు గ్రామం కమ్మ పాలెం చెందిన లక్ష్మీనరసింహులు కొడుకు చిన్నగోడి కుళ్లాయప్ప, సాయిబాబా గుడి వీధికి చెందిన రామయ్య కొడుకు వెల్లూరు ఆంజనేయులు, పెద్దమ్మ గుడి వీధికి చెందిన పెద్దన్న కుమారుడు వలిపి పెద్దన్న, బి.నాగప్ప కుమారుడు బయముక్క మహేష్, విజయ్ నగర్ కాలనీకి చెందిన నరసింహులు కుమారుడు బండ్లపల్లి ఆదినారాయణలు ఉన్నారన్నారు. ఈ కేసులో ఇంకా మిగిలిన వ్యక్తుల్ని తొందర్లో అరెస్టు చేసి వారిని రిమాండ్ పంపడం జరుగుతుందని తెలియజేశారు.

# భంగి ప్రతాప్ ప్రజా పోరాటం యువతకు ఆదర్శం

**కమ్యూనిస్టు యువ నాయకుడుగా చేసిన సేవలు చిరస్మరణీయం**

కళ్యాణదుర్గం, జూన్ 13 ప్రభాతవార్త :

కమ్యూనిస్టు భావాలతో తాడిత, పీడిత ప్రజల కోసం భూ పోరాటాల ఉద్యమంలో చురుకుగా పాల్గొనడమే కాకుండా యువతరానికి దిక్సూచిగా విద్యార్థులకు అండగా నిలిచి సమస్యల పరిష్కారంలో యువ నాయకుడుగా చేసిన సేవలు ఇప్పటికీ యువతరానికి ఆదర్శమని పలువురు వక్తలు పేర్కొన్నారు. భంగి ప్రతాప్ 6వ వర్ధంతి సందర్భంగా స్థానిక సిఐ అండ్ జి చర్చి సమావేశ భవనంలో ఎన్జీవో సంఘం నాయకుడు కిషోర్ కుమార్ అధ్యక్షతన శుక్రవారం సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ తాలూకా అధ్యక్షులు గోపాల్, జర్నలిస్టుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లింగప్రసాద్, గోల్డెన్ బెల్స్ విద్యాసంస్థల పూర్వ అధినేత డేవిడ్ భంగి ప్రతాప్ సతీమణి పరిపూర్ణ తదితరులు ప్రసంగిస్తూ కరువు పీడిత ప్రాంతమైన కళ్యాణదుర్గం నియోజకవర్గంలో పేద ప్రజలకు అండగా నిలిచి అనేక పోరాటాలతో ప్రజా సమస్యల పరిష్కారం కోసం భంగి ప్రతాప్ అందించిన సేవలు అజరామరమని పేర్కొన్నారు. కమ్యూనిస్టు ఉద్యమ నాయకులు,సుదీర్ఘకాలం ప్రజాసేవకు అంకితమైన సేవలు అందించిన భంగి ఎర్రిస్వామి, భంగి రామప్ప వారసత్వంగా అనేక పోరాటాలు సాగించాలని అన్నారు. విద్యార్థి సంఘ ఎన్నికలలో భంగి ప్రతాప్ ఎవరికి మద్దతు ఇస్తే వారే గెలిచేవారన్నారు. స్థానికంగా ప్రజలకు సమస్యలు వస్తే సంబంధిత అధికారుల వద్దకే వెళ్లి సమస్యల పరిష్కారం కోసం ప్రజలకు అండగా నిలిచి పరిష్కరించే వారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చర్చి అధ్యక్షులు చల్లా రాజశేఖర్ చౌదరి, సువార్తికులు ఐజయ్య, చల్లా కిషోర్ కుమార్ చౌదరి, రవి, నాగరాజు నాయక్, జోసెఫ్ కిషోర్ తదితరులు మాట్లాడుతూ భంగి ప్రతాప్ పోరాట ప్రయాణంలో సాగిన అనేక సంఘటనలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. సమావేశానికి ముందు భంగి ప్రతాప్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున అభిమానులు కార్యకర్తలు , కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# రుణాలు పొంది అభివృద్ధి చెందిన సకాలంలో తిరిగి చెల్లించండి

**-వ్యవసాయ రుణాలపై అవగాహన కార్యక్రమంలో రాక్ మేనేజర్ భరత్**



మాట్లాతున్న అనంతపురం రాక్ మేనేజర్ భరత్

ఉరవకొండ, జూన్ 13 ప్రభాతవార్త

బ్యాంకు ద్వారా రుణాలు పొంది వాటితో అభివృద్ధి చెంది సకాలంలో తిరిగి చెల్లించాలని అనంతపురం రాక్ మేనేజర్ భరత్ సూచించారు. స్టేట్ బా ్యంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఆధ్వర్యంలో పట్టణంలోని లయన్స్‌క్లబ్ యోగ, స్టడీ సెంటర్‌లో శుక్రవారం ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ సుధాకర్



అవగాహన కార్యక్రమానికి హాజరైన రైతులు

అధ్యక్షతన రైతులకు వ్యవసాయ రుణాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాక్ మేనేజర్ భరత్ మాట్లాడుతూ పంటల సాగుకోసం వ్యవసాయ రుణాలతోపాటు పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ళు, పందుల పెంపకాలకు కూడా స్టేట్ బ్యాంకు ద్వారా రుణాలు అందిస్తున్నామన్నారు. రైతుల సేవలో బ్యాంకు ముందుంటుందని అయితే రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి బ్యాంకుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఫీల్డ్ ఆఫీసర్లు రవి, గణేష్, హనుమంతు, హోమ్‌లోన్ కౌన్సిలర్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగుదేశం కార్యకర్త మృతి నివాలులు అలర్పించిన జడ్పిటిసి

అగళి, జూన్ 13 ప్రభాతవార్త




నివాళులు అర్పిస్తున్న జడ్పిటిసి

మండల కేంద్రమైన అగళి చెందిన తెలుగుదేశం కార్యకర్త టైలర్ బాబు(63) అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న జడ్పిటిసి ఉమేష్ వారి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తెలుగుదేశం పార్టీ ముఖ్యమైన కార్యకర్తను కోల్పోయిందని, పార్టీకి తీరని నష్టమని ఆవేదన వ్యక్తం చేశారు.

# వేరుశనగను పంపిణీ చేసిన జడ్పిటిసి

అగళి, జూన్ 13 ప్రభాతవార్త



వేరుశనగను పంపిణీ చేసిన జడ్పిటిసి

మండల పరిధిలో నరిన ముక్కడాంపల్లి గ్రామంలో ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాగు చేసుకోవడానికి సబ్సిడి ధరలతో వేరుశనగను పంపిణీ చేసినట్లు జడ్పిటిసి ఉమేష్ తెలిపారు. రైతులు ఈ అవకాశ శాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి వసంత్‌నాయక్, నాయకులు రిటైర్డ్ టీచర్ నారాయణప్ప, మల్లికా, తిప్పేస్వామి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# చిక్కహాళ్ళి గ్రామపంచాయతీ నూతన అధ్యక్షురాలిగా రామాంజనమ్మ గోపి ఎన్నిక

పావగడ, జూన్ 13 ప్రభాతవార్త

పావగడ తాలూకాలోని వైఎన్ హోసకోటే హోబిళి చిక్కహళ్లి గ్రామపంచాయతీ నూతన అధ్యక్షురాలుగా కాంగ్రెస్ పార్టీ మద్దతుతో గెలిచిన రామాంజనమ్మ గోపి శుక్రవారం జరిగిన ఎన్నికల్లో గెలుపొందినట్లు ఎన్నికల అధికారి తహసిల్దార్ వరదరాజులు తెలిపారు. గ్రామపంచాయతీలో 14 మంది వార్డు సభ్యులు ఉండగా రామాంజనమ్మ గోపి, పార్వతమ్మలు నామినేషన్లు దాఖలు చేశారు ఎన్నికల్లో రామాంజనమ్మ గోపికి 8 ఓట్లు రాగా పార్వతమ్మకు 6 ఓట్లు వచ్చాయి రెండు ఓట్ల తేడాతో రామాంజి నమ్మ గోపి విజయం సాధించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు హర్షం వ్యక్తపరిచారు

# రైతులకు సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ

వజ్రకరూరు జూన్ 13 ప్రభాతవార్త



రైతులకు విత్తన వేరుశనగని పంపిణీ చేస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

మండలంలోని రాగులపాడు గ్రామ సచివాలయ పరిధిలో శుక్రవారం తెలుగుదేశం పార్టీ నాయకులు ఆధ్వర్యంలో రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ విత్తన వేరుశనగను పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పాటుపడుతుందన్నారు సూపర్‌సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలుచేస్తుందన్నారు. రైతు సంక్షేమానికి పాటుపడుతుందన్నారు ఈనెల 21న రైతుల ఖాతాలోకి అన్నదాత సుఖీభవ నగదును జమ చేయనున్నట్లు వారు తెలిపారు కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రశాంత్ రెడ్డి, బొబ్బిలి నరేంద్ర వడ్డే శ్రీరాములు, లక్ష్మీనారాయణ, వెంకటేష్ రైతులు తదితరులు పాల్గొన్నారు

# చిరుత సంచారం..గొర్రెలపై దాడి

అగళి, జన్ 13 ప్రభాతవార్త




చిరుత గొర్రెలపై దాడి చేసిన దృశ్యం

మండల పరిధిలోని గాయత్రి కాలనీ సమీపంలోని ఫారెస్ట్‌లో గత 20రోజులుగా చిరుత సంచారం చేస్తున్నా ఫారెస్ట్ అధికారులు పట్టించుకోవడం లేదు. గొర్రెలు, మేకలపై తరచూ చిరుత సంచారం చేస్తోంది. ఈ రోజు సాయంత్రం పి.బ్యాడిగెరకు చెందిన రైతుకు సంబంధించిన గొర్రెలపై చిరుత దాడి చేసింది. 20 రోజులుగా చిరుత గాయత్రి కాలనీ, పి.బ్యాడిగెర, ఉల్లెకెర సమీపంలోని గ్రామాల పక్కలకు, ఇళ్లపక్కలకు వచ్చి చిరుత తిరుగుతున్నా ఫారెస్ట్ అధికారులు నిద్రలో ఉన్నారు. కనీసం ఫారెస్ట్ అధికారులు ఒక్కసారైనా ఇటువైపు వచ్చి పరిశీలించలేదు.గ్రామాలకు మధ్య, పొలాల మధ్య చిరుత తిరుగుతున్నా ఫారెస్ట్ అధికారులు పట్టించుకోలేదు. ఇప్పటికైనా ఫారెస్ట్ అధికారులు చొరవ తీసుకుని సంచరిస్తున్న చిరుతలను పట్టి క్యాలో వదలాలని రైతులు కోరుతున్నారు.

# రాఘవేంద్ర ఇంటిలో చోరీ

**- 8 తులాల బంగారు, నగదు**

చెన్నేకొత్తపల్లి, జూన్ 13 ప్రభాతవార్త



బీరువాను పగలగొట్టి చోరీ చేసిన దృశ్యం

మండల పరిధిలోని ద్యామాజిపల్లి గ్రామంలో ఉన్నటువంటి రాఘవేంద్ర ఇంటిలో గురువారం రాత్రి చోరీ జరిగి 8 తులాల బంగారం, నగదు చోరీ జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేకు.. రాఘవేంద్ర తన కుటుంబ సభ్యులు తిరుపతికి వెళ్లగా తానొక్కడే ఇంటిపైన నిద్రిస్తుండగా గుర్తు తెలియని దొంగలు అర్ధరాత్రి సమయంలో చడీ చప్పుడు లేకుండా ఇంటి తాళాలు పగలగొట్టి, ఇంటిలోకి ప్రవేశించి బీరువా తాళం సైతం పగలగొట్టి బీరువాలోని నగదు, బంగారం అపహరించినట్లు తెలియజేశారు. తెల్లవారు జామునే ఆయన లేచి చూడగా ఇంటి తలుపులు తెరిచివుండటంతో హుటాహుటిన ఇంటిలో మొత్తం చూడగా బీరువా సైతం పగలగొట్టి చోరీ చేసినట్లు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో పోలీసులు హుటాహుటిన డాగ్‌స్క్వాడ్‌తో సహా ప్రవేశించి సంఘటన స్థలాన్ని పరిశీలించినట్లు ఆయన తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపాడు.



డాగ్‌స్క్వాడ్‌తో పరిసరాలను పరిశీలిస్తున్న పోలీసులు

